# సభ్యత

"రావోయ్ గోపాలం కాస్త కాఫీ తాగి పోదాం. అప్పుడే ఇంటికి వెళ్లి ఏం చెయ్యాలి." కోర్టు ఆవరణనుండి బయటకు వస్తూ పిలిచేడు శేఖరం బి.ఏ.,బి.ఎల్.

"క్షమించు బ్రదర్! నే నిప్పుడే కాఫీ టిఫిను తీసుకున్నా."

"రావోయ్ ఫరవాలేదూ. ఇంత టీ తీర్థంతాక పోదులే. ఏదో లైటుగా తీసికొని వచ్చేద్దాము."

తోటివకీలు బలవంతంచేస్తుంటే సాటి గోపాలం కాదనలేకపోయేడు. మోడరన్ కాఫీహోటల్ దరిదాపులకు వెళ్లేసరికి అడ్వొకేటు శంకరం తగిలేడు.

"ఏమోయ్ శేఖరం మీ రిద్దరేనా కాఫీ తాగేవాళ్లు! నేను వస్తున్నా, ఉండండయ్యా."

మంచి ఫేనున్న టేబులు చూసుకొని ముగ్గురూ మూడుకుర్చీలలోనూ ఆసీనులయ్యారు. పెన్సిలు చెవిలోనూ, బిల్లుబుక్కు జేబులోనూ జాగ్రత్తచేసుకొని రావలసిన సర్వరు ఆ టేబిలుదగరకు వచ్చేడు.

"ఏం కావాలి సార్?"

"మూడు మసాలాదోసెలు చెప్పవయ్యా" శేఖరం ఆర్డరిచ్చేడు.

"సారీ...నాకేమీవద్దు బ్రదర్. నీమాట కాదనలేక కూడా వచ్చేనంతే." గోపాలం అన్నాడు.

"పోనీ ఇడ్లీ తీసుకో బ్రదర్." శేఖరం బలవంతం చేసేడు.

"నాకేమీవద్దు, క్షమించు."

"సరే రెండు మసాలాదోసెలు చెప్పి... ఈలోగా రెండుప్లేటు ఇడ్లీ, నెయ్యి కారప్పొడివేసి తీసుకురా. చట్నీ వేరే ప్లేటుతో తీసుకురా."

"నాకు సాంబారు తీసుకురా అయ్యర్." శంకరం అన్నాడు.

శేఖరం, శంకరం కాకనే కాదని బలవంతం చెయ్యడంచేత గోపాలం కాఫీ మాత్రం తీసుకున్నాడు. రూపాయి బిల్లు శేఖరం చేతిలో పెట్టేడు సర్వరు.

"ఇదిగో శేఖరం నేనిస్తా. నువ్వాబిలు ఇటు తే." అంటూ జేబులో చెయ్యిపెట్టేడు శంకరం.

"అహః...అదేమీ కుదరదు...నే నే ఇస్తా." శేఖరం అయిదురూపాయల కాగితం తీసేడు పర్సులోంచి.

"నువ్వుండు శేఖరం...ఇదిగో...ఆగు." అంటున్నాడే కాని జేబులో చెయ్యి బయటకు తీయలేదు శంకరం.

"మీరిద్దరూ వద్దు... నేనిస్తా..."జేబులో పదిరూపాయల కాగితం చటుక్కన తీసేడు గోపాలం.

"బాగుందోయ్ గోపాలం...నువ్విస్తా నంటా వేమిటి?" కాషియర్ చేతిలో పెట్టేడు ఐదురూపాయల కాగితం, బిల్లూను.

"ఇదిగో...అయ్యరుగారూ...ఆ కాగితం ఇచ్చెయ్యండీ ..పుచ్చుకోకండి. నే నిస్తున్నా." అప్పటికి శంకరం జేబులో చెయ్యి రూపాయికాగితంతో బయటకొచ్చింది.

**శ్రావణి**

ఈలోపులో శేఖరం చిల్లర తీసుకోడం జరిగిపోయింది. బాగుండదని కాబోలు శంకరం మూడు కిళ్ళీలు, మూడు గోల్డుఫ్లేక్ సిగరెట్లూ తీసి గోపాలానికి, శేఖరానికి ఇచ్చేడు. హాయిగా కడుపు తడుముకుంటూ ముగ్గురూ బయటకు వస్తున్నారు ఆ భవనంలోంచి.

ఉదయంనుండీ ఆ హోటలు గుమ్మందగ్గర కాచుకొని, డొక్కలు లోతుకుపోయి, వడుము పడిపోయిన ఒక బికారి తాత ఈ ముగ్గురు లాయరూ కేఫ్ టేబిలువద్ద ఇంతవరకు పడిన ఘర్షణను గమనించేడు.

"బాబూ ఒక్క అణా ఇప్పించరూ... టీ తాగుతానూ..." శేఖరంవైపు చెయ్యి జాచేడు.

"ఎంతకావాలీ...అణా...! ఫో...టీ తాగుతాట...అణా కావాలిట...అంతకంటె తక్కువ కోరిక లేవు కాబోలు చూడండి శంకరంగారూ!"

శంకరానికి మరీ కోపమొచ్చింది కాబోలు కొంకొరచూసేడు ఆ ముసలివానివైపు.

"బాబూ పొద్దుటనుంచీ తిండిలేదు. ఒక్క అణాఇస్తే ... ఏదో ఈ రోజుకు టీనీళ్లుతాగి పడుకుంటా. అయ్యా మీలో ఒక్కరి తాంబూలం ఖర్చు ఉండదు బాబయ్యా." ఈసారి శంకరంవైపు తిరిగేడు.

"పో...పోరా...టీ...నీకక్కడా... టీయే. కొంచెం నీళ్ళుతాగి పడుకో...అదే నిద్రపట్టేస్తుంది." తనెంతో ప్రయోజకత్వంగా మాట్లాడినటు నవ్వుకున్నాడు శంకరం. గోపాలం తీక్షంగా ఒక్కసారి శంకరం ముఖంలోకిచూచి అసహ్యించుకున్నాడు. వెంటనే జేబులో చెయ్యిపెట్టేడు. బేడకాసు తగిలింది. బయటకు తీసేడు. మళ్ళీ ఎందుకో ఆలోచించేడు; శంకరం, శేఖరం తనను చూచి ఏమైనా అనుకుంటారేమో...అని జంకేడు...తిరిగి ఆ బేడకాసు జేబులో వేసుకున్నాడు.

## 2

"శారదా...లేటవుతూంది. నువ్వా కంచాలుకడిగి ముస్తాబు ప్రారంభిస్తే నేను టాక్సీ తీసుకొస్తా." తృప్తిగా భోజనంచేసి సినిమా ప్రోగ్రాం కాబోలు తలపెట్టేడు శేఖరం.

"అమ్మా...మా ధాకవళం..." వీధి గుమ్మంలో ఒక చిన్న పిల్ల కంఠంలా వినిపించింది.

"ఇదిగో ... మిమ్మల్నే ... ఆ పిల్లని కొంచెం నించోమనండి ... కొంచెం అన్నమూ, పులుసూ మిగిలేయి." శారద భర్తతో చెప్పింది.

"ఇదిగో శారదా ఈ రాత్రిళ్లు భిక్షం మానెయ్యమని ఎన్నిసారు చెప్పేను నీకు? అయినా అంత ఎక్కువగా వండుకోకపోతే నేం?...ఇదిగో పిల్లా...వెళ్లు...ఏమీ లేదు, భోజనాలయిపోయేయి". శేఖరం వకాల్తానామా పుచ్చుకొని చెప్పేసేడు.


**తెల్ల వెండ్రుక లుండవు**

(GOVT REGD).

రంగులనుచూచి మోసపోవద్దు. అది తాత్కాలికము. మా సువాసన "విశ్వకళ్యాన్ తైలం" అనేక వనమూలికలతో ఆయుర్వేద పద్ధతిలో తయారైనది. 50 సం॥ ల వయస్సువరకు వెండ్రుకలను నల్లగా వుంచును. ఇదిగాక మెదడుకు చల్లదనమునిచ్చును. ఉన్మాదము, తలనొప్పి వగైరా జబ్బుల రానీయదు. "జ్ఞాపకశక్తి"ని కంటిచూపును వృద్ధి చేయును. కొద్దిగా నెరసివుంటే ఒక సీసా రు. 5/- 3 సీసాలు రు. 12, సగము నెరసి వుంటే ఒకసీసా రు.6/- 3 సీసాలు రు.15/- పూర్తిగ నెరసివుంటే ఒక సీసా రు. 7/-లు 3 సీసాలు రు. 18/- లు పని చేయలేదని ఋజువుపర్చిన పూర్తి సొమ్ము వాపసు చేయబడును. కోరినవారికి పూచీ.

MODERN DRUGS CORPN
(106) P. O. Pakribardwan (Gaya)

# ★ సభ్యత ★

"అయ్యో... అదేమిటండీ..." అంటూనే చేతో పులుసుగిన్నె అన్నం, పళ్ళెం పట్టుకొచ్చి ఆ పిల్లకు పెట్టిపంపించింది.

"ఎన్ని సార్లు చెప్పినా బుద్ధిరాదు. "ఊరికే వస్తున్నట్లుగా ... బండి తగలెయ్యడం ... అక్కడనుంచి దానధర్మాలు..." శేఖరం విసుక్కున్నాడు.

"ఫరవాలేదులెండి. ఒక రోజు కొంచం మిగిలితే ఎవరికైనా పెడితేపాపం లేదు. మనం ఎన్ని ఖర్చులు చెయడం లేదు. అందులోనూ అనవసరపు ఖర్చులు." భర్తమాటకు సమాధానం చెప్పకుండా ఉండడం కష్టమయింది శారదకు.

కూతురుకు ముస్తాబుచేసి, శారద సింగారించుకునేసరికి శేఖరం టాక్సీ తీసుకొచ్చేడు.

పాపను బయటకు దింపి మీటరుచూసేడు శేఖరం. పన్నెండణాలయింది. శారదకూడ మీటరు జాగ్రత్తగా పరిశీలించింది. జేబులోంచి రూపాయితీసి డ్రైవరు చేతిలో పెట్టేడు.

"రా శారదా పోదాం టైమవుతూంది!"

"ఉండండీ. మిగిలిన పావలా పుచ్చుకో వద్దూ! వెళిపోతారేం...?" శారద అమాయకంగా అడిగినటనిపించింది శేఖరానికి.

"రూపాయి...ఇచ్చేసేను...అంతేలే...రా" శారద తెల్లబోయి చూస్తూంది.

"బాబూ...ఒక కాని ఇప్పించరూ!" ఒక కుంటి ముసలిది శేఖరంవైపు జాలిగా చెయ్యి జాపింది.

"చిల్లరకానులు లేవు...పో...అందరూ బిచ్చగాళ్ళే...పోయి యేదైనా పనిచేసుకో రాదూ...అయినా కడుపు కరగకుండా కాలక్షేపం జరుగుతూంటే మీరు పనెందుకు చేస్తారూ?" తన తెలివినంతా ఉపయోగించినట్లు మాట్లాడేడు శేఖరం ఆ ముసలి దానిముందు.

"ఇదిగో అమ్మా"...శారద చెంగునవున్న చిల్లర డబ్బులలో అణాతీసి ఆ ముసలిదాని చేతిలో పెట్టింది. తిరిగి ఆ ముసలిది మూడు కానులు ఈయబోయింది శారదకు.

"తీసుకో...అమ్మా...టీ తాగు...కానీ కేముంది.?" శారద చల్లని మాటలకు ఆ అవ్వకడుపు నిండిపోయింది. "నూరేళ్లూ పసుపుకుంకుమతో బ్రతుకుతల్లీ" అనుకుంటూ పోయింది ఆ ముసలిది.

"ఏం శారదా? దానాలెక్కువయి పోతున్నాయి. రేపోమాపో చచ్చేలావుంది- ఇంకా అడుక్కుని చావకపోతే ఏ మర్యో గొర్యో చూచుకోకూడదూ." శేఖరం ములకనగా మాటాడడం శారదకు నచ్చలేదు.

"ఇప్పుడేకదండీ ఏదైనా పనిచేసుకో కూడదా అన్నారు! మళ్ళీ అంతలోనే చచ్చేలాగుందంటారేమిటి?! చచ్చేలాగున్న దానికి పనెవరిస్తారేమిటి? ఒక అణా దానికి ఇచ్చినంతలో మన సంపాదన తరిగి పోదులెండి. చూశారూ మీరు దాన్ని చావకూడదా అన్నారు; అది మిమ్మల్ని నూరేళ్ళు బ్రతకమని నన్ను పసుపు కుంకుమ పెట్టుకోమని దీవించింది." శారద మాటాడే ప్రతిమాటా శేఖరానికి శూలంలా నాటుతూంది.

మొత్తానికి సినీమా ప్రారంభించడం, ఇంటర్ వెల్ ఇవ్వడంకూడా అయింది. "సోడా, డ్రింక్స్" అంటూ అమ్మకం కుర్రాళ్లు కేకలు పెడుతున్నారు. శేఖరం మూడు డ్రింకులు తీసుకున్నాడు. ఒకటి శారదకు, మరొకటి పాపకు ఇచ్చేడు. మూడవది తనకోసం కాబోలు తీసుకున్నాడు. కాని తనసీటుకు ఎడమవైపు ఒక ఆంగ్లో ఇండియన్ యువతి కూర్చుంది. అతనికి ప్రాణం ఒప్పలేదు కాబోలు పాపం ఆ డ్రింకు సీసా ఆమె కీయబోయేడు.

"నో...థేంక్స్..." అన్న మాటలు శేఖరాన్ని బాధపెట్టేయి.

"ఫరవాలేదు తీసుకోండి" ఇంగ్లీషులో తిరిగి బలవంతం చేసేడు శేఖరం. ఆ యువతి పదరు సీసాలో నీళ్ళు సగంమాత్రమే తాగి మిగిలినది అలాగే వుంచేసింది. శారదకు ఒళ్ళు ఉడికిపోయింది. బాగుండదని కాబోలు మాట్లాడలేదు.

12½ గం॥లకు షో పూర్తయింది. శేఖరం పాపనెత్తుకుని శారదతోపాటు బయటకు వచ్చేడు.

"శారదా ... తలనొప్పిగా వుంది... కేంటీన్‌లో కొంచం కాఫీ తాగి మరి వెడదాం." శేఖరం కుటుంబసహితంగా ఆ సినీమా హాల్లోని కేంటీనుకు దారి తీసేడు.

ఆ హోటల్‌లోని సర్వరులందరు ఒకే విధమైన దుస్తులు వేసుకొని చాల క్రమశిక్షణతో పనిచేస్తున్నట్లు కనిపిస్తున్నారు. శేఖరం మూడు కాఫీలు తెమ్మని చెప్పేడు. శారద తనకు పాపకు ఏమీ అక్కర్లేదు అని చెప్పింది.

"సర్ ...అయితే తమకు 'చిప్సు'...కూడ తెస్తాను' అంటూ సర్వరువెళ్లి చిప్సు కాఫీతో తయారయేడు. శేఖరం కాఫీ ముగించేలోగా ఆరుఅణాల బిలు ఒక ప్లేటులోవుంచి శేఖరందగ్గర వుంచేడు. శేఖరం రూపాయి తీసి ఆ ప్లేటులోవుంచేడు. వెంటనే ఆ సర్వరు రూపాయితీసికొని తిరిగి చిల్లర పట్టుకొచ్చి ఆ ప్లేటులో వేసేడు. శేఖరం ఆ ప్లేటులోని పదణాల చిల్లరలోనూ, అర్ధరూపాయి తీసికొని మిగిలిన బేడ ఆ ప్లేటులోనే వుంచేసేడు. "ఏం శారదా పోదాం?" "ఆదేమిటండీ ఆ బేడ వదిలేశారేం?!" శారద అది తీసింది. సర్వరు తెల్లబోయి చూస్తున్నాడు.

"ఛ...ఛ...నీ కేమీ తెలియదు నువ్వూ... ఆ బేడ అందులో వుంచెయ్...అది సర్వరుకు." శారదచేతిలోని బేడ తీసికొని తిరిగి ఆ ప్లేటులో వుంచేసేడు శేఖరం.

"ఎందుకండీ వాడికి బేడ ఇచ్చేరు. తిండి తిప్పలు లేవా వాడికి?"

"ఏడిశావులే బయటకు రా చెబుతా. ఇక్కడ అడిగితే అంతా నవ్వుతారు" శేఖరం శారదను చెయ్యిపట్టుకుని బయటకు తీసుకొని వచ్చేడు.

"ఔను మీరు చేసే పనులేమీ బాగులేవు. ఆ టాక్సీవాడికి అప్పనంగా పావలా ఇచ్చేరు. దాని కెవరికో ఒక డ్రింకు. అందులో సగం వృధాగాపోయింది. వచ్చేటప్పుడు ఆ కేంటీన్‌లో వాడికి బేడ మొత్తం ఈ రోజు మీరు వృధాగా తగలేసినది పన్నెండణాలు వుంది. పైపెచ్చు ఆ ముసలిదానికి ఒక్క అణా ఇవ్వడానికి మీకు చేతులు రాలేదు! మూడు కబళం అంటూవచ్చే వాడికి అన్నం పెడితే తప్పా! బాగుందండి మీ తెలివి?" శారద ఇల్లు చేరడంతోనే భర్తను దులిపేసింది.

"శారదా నువ్వు పల్లెటూరిదానవు. నీకు నాగరికత తెలియదు. దీన్నే సభ్యత అంటారు. కొంచమో గొప్పో ఎప్పుడైనా సిటీలో వుంటే ఏమైనా తెలిసేది. అయినా నిన్ను అనవలసినపనేముందిలే. నిన్ను పుట్టించిన బ్రహ్మదేవుడని అనాలి" [illegible] కోకుండా నవ్వడం ప్రారంభించేడు శేఖరం.

"బాగుంది లెండి నవ్వు. ఇంకా నాగరికత, సభ్యత, ఏది నాగరికత? తిండి లేని పసిపాపలు అమ్మా అంటూ ఇంటిలోకి వస్తే వాళ్ళకు కొంచం అన్నం పెట్టడం నాగరికతా? రోజుకు ఏదారు రూపాయలు సంపాదించుకునే టాక్సీవాడికి ఊరికే నాలుగణాలు ఇవ్వడం నాగరికతా? నడుం వంగిన ముసలిదానికి ఒక అణా డబ్బు ఇవ్వడం నాగరికతా? లేక ముప్పొద్దు కడుపునిండా తింటూ నెలకు ఏభైరూపాయలు గడించుకొనే ఆ సర్వరుకు రెండణాలు ఇవ్వడం నాగరికతా? ఏది నాగరికత? ఏది సభ్యత? పైగా మీరు సిటీలోవుండి నేర్చుకున్నదేనా?" శారదతను భర్తతో మాట్లాడుతున్నాననే మాట మరచిపోయిన ధోరణిలో మాట్లాడుతూంది. టాక్సీ దిగినప్పటినుంచి ఆమె ఒళ్ళు మండిపోయింది. ఆఖరుకు ఆగలేక భర్తను ఆ నాలుగుమాటలు అనేసింది.

శారద అన్నమాటలోని భావం శూలంలా నాటుకుంది శేఖర్‌కు. ఒక్కసారి "నూరేళ్లు పసుపుకుంకుమతో వర్ధిల్లు తల్లీ" అన్న ముసలిదాని మాటలు అతని చెవుల్లో గింగురుమన్నాయి. అప్రయత్నంగా అతని కండ్లవెంట రెండుకన్నీటి బిందువులు రాలేయి.